సాక్షి నల్లగొండ
గురువారం । 7 । డిసెంబర్ । 2023



కరాటే పోటీలు..
నల్లగొండలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కరాటే బాల, బాలికల పోటీలు బుధవారం కొనసాగాయి. - 10లో



ఆరుతడి పంటలే మేలు
యాసంగిలో ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగు మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. - 8లో



కూడళ్లు.. యమ డేంజర్
నల్లగొండ పట్టణంలో ఇటీవల ఏర్పాటు చేసిన కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

16.1 మి.మీ సగటు వర్షపాతం నమోదు

నల్లగొండటౌన్ : మిచాంగ్ తుపాన్ కారణంగా జిల్లాలో 16.1 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. అత్యధికంగా మిర్యాలగూడ డివిజన్‌లోని దామరచర్ల మండలంలో 44.8 మి.మీ, మిర్యాలగూడ 41.4, త్రిపురారం 38.8, అడవిదేవులపల్లి 37.2, మాడ్గులపల్లి 36.0, వేములపల్లి 35.1, తిరుమలగిరి సాగర్ 33.1, అనుముల 25.2, నిడమనూరు 28.6, పెద్దవూర 16.0, చిట్యాల 6.7, నార్కట్‌పల్లి 7.9, కట్టంగూర్ 13.1, శాలిగౌరారం 18.6, నకిరేకల్ 26.1, కేతేపల్లి 30.2, తిప్పర్తి 20.3, నల్లగొండ 8.8, కనగల్ 4.0, మునుగోడు 1.9, చండూరు 2.3, గట్టుప్పల్ 2.0, మర్రిగూడ 1.5, చింతపల్లి 1.7, నాంపల్లి 0.7, గుర్రంపోడు 4.2, పీఏపల్లి 8.9, నేరడుగొమ్ము 3.4, కొండమల్లేపల్లి 2.4, దేవరకొండ 1.4, గుండ్లపల్లి 3.0, చందంపేట 9.5 వర్షం కురిసింది.

ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం : జూలకంటి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో చివరి వరకు కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని భావించామని, కానీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని అన్నారు. ప్రభుత్వంపై, ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి చేపట్టిన సేవా కార్యక్రమాలు అతనిపై సానుకూలతను పెంచాయని, ఆ కోణంలోనే ఆయన గెలిచారని చెప్పారు. కొత్తగా ఏర్పడుతున్న ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బాంవత్ల పాండు, మంగారెడ్డి, వినోద్‌నాయక్, రామ్మూర్తి, పోలేబోయిన వరలక్ష్మి పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ఆవిష్కరణకు ఎంపిక



వెన్నెలను అభినందిస్తున్న యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్: 2022–23 విద్యా సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఇన్‌స్పైర్(జూనియర్ శాస్త్రవేత్త) ఆవిష్కరణకు మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని మద్దెల వెన్నెల రూపొందించిన 'ఎలక్ట్రో మ్యాగ్నటిజం' ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేకే జయరాజన్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గులాం జహంగీర్ తెలిపారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో వెన్నెలకు ఉపాధ్యాయులు అభినందన సభను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల చివరిలో జిల్లాస్థాయిలో కూడా నిర్వహించే ఇన్‌స్పైర్‌లో కూడా వెన్నెల పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

'ఆవాస భరోసా' కార్డులు అందజేత



కార్డులను అంజేస్తున్న వెంకటరమణచౌదరి

మిర్యాలగూడ: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ సర్పంచ్ భోగవిల్లి వెంకటరమణచౌదరి తన భార్య సునీత జ్ఞాపకార్థం భోగవిల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్‌ను ప్రారంభించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా గ్రామంలో ఇళ్లు లేక కిరాయి ఇళ్లలో ఉంటున్న పేదలకు ఆవాస భరోసా అనే పథకాన్ని ప్రారంభించినట్లు బుధవారం ఆయన తెలిపారు. 25 మంది ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రతి నెల రూ.1000 చొప్పున అందించే విధంగా ఆవాస భరోసా కార్డులను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలకు సంబంధించి పలువురికి కార్డులు అందజేసినట్లు తెలిపారు. భోగవిల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులోనూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అమాత్యులు.. ఇద్దరు!

ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు

- నేడు ప్రమాణ స్వీకారం
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆర్థిక శాఖ?



కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం గురువారం కొలువుదీరనుంది. అందులో తొమ్మిది నుంచి 12 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది. వారిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండనున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రుల శాఖల కేటాయింపుపై ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేయనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఉత్తంకుమార్ రెడ్డికి ఆర్థిక శాఖ అప్పగించనున్నట్లు తెలిసింది. సీనియర్ నాయకులైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించిన వారు కావడంతో వారి సీనియారిటీకి ప్రాధాన్యం ఇచ్చారు.

రాజగోపాల్‌రెడ్డికి మరో పదవి

మునుగోడు నుంచి రెండోసారి గెలుపొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఆయనకు మంత్రి పదవి లేదంటే మరేదైనా ప్రాధాన్యం కలిగిన పదవిని ఇచ్చే అవకాశం ఉంది.

నేడు ప్రమాణ స్వీకారోత్సవం

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 11 మంది కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందగా, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. గురువారం తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఆయన మంత్రివర్గంలో నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు చోటు దక్కింది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో మొదటిసారి ఐటీ, క్రీడలు, యూత్, కమ్యూనికేషన్లు, ఓడరేవులు, విమానశ్రయాలు, సహజవాయువు పరిశ్రమలకు మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలోనూ మంత్రిగా పనిచేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ తరువాత జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవికి అవకాశం కల్పించారు. ఆయన గృహ నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో ఉత్తమ్ పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వీరిద్దరూ మంత్రులుగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో జిల్లా నుంచి మాజీ మంత్రులు ఇద్దరికి ఇప్పుడు మంత్రి పదవులు దక్కాయి.

- అంబేద్కర్‌కు నివాళి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని డీఈఓ కార్యాలయం ఎదురుగా అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్ ద్వారా పని సులభం

- జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : కొలాబ్ ఫైల్స్ వెబ్ అప్లికేషన్ ద్వారా పని సులభతరం అవుతుందని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. ఈ వెబ్ అప్లికేషన్‌పై బుధవారం వివిధ శాఖల ఉద్యోగులకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొలాబ్ ఫైల్స్ వాడడం వల్ల కార్యాలయాల్లో పని వేగంగా పూర్తవుతుందని తెలిపారు. మనకు కావాలిన్న డాటాను సమీకరించుకోవడానికి ఈ అప్లికేషన్ ఉపయోగపడటం విశేషమన్నారు. కార్యక్రమంలో ఐటీ డైరెక్టర్ (ఎన్ఐసీ) రాకేష్, ఐటీ మేనేజర్, (ఎన్ఐసీ) హైదరాబాద్ ప్రకాష్, జిల్లా ఇన్చర్ మేటిక్స్ అధికారి గణపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

యాదాద్రిలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు... స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం తదితర పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి, ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. ఆలయంలో భక్తుల రద్దీ సాధారంగా ఉంది.

20న పోచంపల్లికి రాష్ట్రపతి రాక



సాక్షి, యాదాద్రి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 20న భూదాన్‌పోచంపల్లికి విచ్చేయనున్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన థీమ్ పెవిలియన్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక్కత్ చేనేత వస్త్రాల తయారీ, చేనేత కార్మికులు, పద్మశ్రీ, సంత్‌కబీర్ జాతీయ అవార్డు గ్రహీతలతో ముఖాముఖి లో పాల్గొంటారు. అనంతరం పోచంపల్లి హెచ్‌డబ్ల్యూసీఎస్(హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ) షోరూం, హెచ్‌డబ్ల్యూసీఎస్ సీఎం ఇక్కత్ షోరూంను సందర్శించనున్నారు. హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి విడిది భవన్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11.10 గంటలకు భూదాన్ పోచంపల్లిలోని జేవీఎస్ గార్డెన్‌కు రాష్ట్రపతి చేరుకోనున్నారు. సుమారు గంటపాటు రాష్ట్రపతి పర్యటన కొనసాగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

లెవీ బియ్యాన్ని వెంటనే అప్పగించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పక్కన డీఎస్ఓ

మిర్యాలగూడ : లెవీ బియ్యాన్ని వెంటవెంటనే అప్పగించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యాసంగి, వానాకాలానికి సంబంధించిన 32,770 టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలన్నారు. లెవీ అప్పగించే విషయంలో మిల్లర్లు అలసత్వం వహించవద్దని సూచించారు. అంతకుముందు మాడ్గులపల్లి మండలంలోని బొమ్మకల్, వేములపల్లి మండలంలోని సల్కునూరు, ఆమనగల్లు ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ చెన్నయ్య, సివిల్ సప్లయ్ డీటీ జావేద్, ఆర్ఐ సురేందర్‌సింగ్, మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్..!



పెద్ద గడియారం సెంటర్‌లో ఖాళీ స్థలం

- ప్రభుత్వం మారడంతో తెరపైకి కొత్త ఆలోచన
- మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని కొందరి భావన

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో (ఆర్ అండ్‌బీ, ఐబీ కార్యాలయాల స్థలం) నిర్మించాలనుకున్న కళాభారతి స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలనే వాదన తెరపైకి వస్తోంది. ఆర్ అండ్‌బీ, ఐబీ కార్యాలయాలు కూల్చే సమయంలోనే చాలా మంది ముఖ్యులు ఇక్కడ కళాభారతి ఎందుకనే ప్రశ్నలు లేవనెత్తారు. కానీ అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఎవరూ తమ వ్యతిరేకతను బయటికి వ్యక్తపర్చలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా ఓటమి చెందిన విషయం తెలిసిందే. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి కూడా అవుతారని తెలుస్తుండడంతో పాత ప్రతిపాదనలు కొన్నింటిని సమీక్షించి మార్పులు, చేర్పులు చేస్తారనే వాదన వినిపిస్తోంది.

కళాభారతి వేరే చోట నిర్మించాలనే ప్రతిపాదన

గడియారం సెంటర్ నల్లగొండ జిల్లా కేంద్రంలో అత్యంత రద్దీ ఉండే ప్రదేశం కావడం, ఇక్కడ నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుండడం, ట్రాఫిక్ సమస్యలు తదితర వాటిని దృష్టిలో పెట్టుకొని కళాభారతి ఆడిటోరియాన్ని ఇతర చోట నిర్మించాలనే ప్రతిపాదనను కొందరు తీసుకొస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణ నడిబొడ్డున రూ.90 కోట్లతో కళాభారతి ఆడిటోరియం నిర్మాణం చేపట్టడం వల్ల మున్సిపాలిటీకి భారమే తప్పితే ఆదాయం సమకూరే అవకాశం కూడా లేదనే విషయాన్ని లేవనెత్తుతున్నారు. ఇదే స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూర్చుకోవచ్చనే కోణంలో ఆలోచిస్తున్నారు. ఇక్కడ దుకాణాలకు మంచి డిమాండ్ ఉంటుందని.. ఇదే విషయాన్ని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి కళాభారతి స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించడం వల్ల సుదీర్ఘకాలం పాటు ఆయన పేరు నిలబడుతుందని చెబుతున్నారు.

మున్సిపాలిటీకి ఆదాయం అవసరమే..

నీలగిరి మున్సిపాలిటీ విస్తీర్ణం ఇటీవల భారీగా పెరిగింది. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట సెంట్రల్ లైటింగ్ మున్సిపాలిటీ పరిధి వరకు చేపట్టడం ద్వారా కరెంట్ బిల్లులు కూడా భారీగా వస్తోంది. చెత్త సేకరణ వాహనాలు వందకు పైగానే ఉన్నాయి. వీటితో పాటు మున్సిపాలిటీలో చివరి శ్రేణి ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, పంప్‌హౌజ్ కరెంట్, వీధి దీపాల కరెంట్ బిల్లులు, ఇతర సాధారణ ఖర్చులు నెలకు దాదాపు రూ.2 కోట్లకు పైగానే అవుతున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. నెలవారీగా ఇంటి పన్ను, కుళాయి పన్నుల ద్వారా ఆదాయం వచ్చే అవకాశం లేదు. దీంతో మున్సిపాలిటీ నిర్వహణకు ఆదా య వనరులు సమకూర్చుకోవాల్సి వస్తోంది. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరిగి మున్సిపాలిటీ నిర్వహణ ఇబ్బందులు తీరుతాయని కొందరు పాలకవర్గ సభ్యులు భావిస్తున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి




త్రిపురారంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

త్రిపురారం : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ.. వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని డీఈఓ భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం త్రిపురారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షణ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థి వారీగా ప్రారంభ పరీక్ష గ్రేడ్‌లు అప్‌లోడ్ చేసి ప్రతి నెలా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ప్రగతిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. బోధన విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో త్రిపురారం మండల ఎంఈఓ బాలాజీ నాయక్, నోడల్ అధికారి రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కర్నాటి వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్‌లు చిర్ర మల్లయ్య, మధుమోహన్, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక.. పంచాయతీ పోరు

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు

- ఫిబ్రవరి 1తో ముగియనున్న ప్రస్తుతం పాలకవర్గం పదవీ కాలం
- ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఈ నెల 30వ తేదీ నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- జిల్లాలోని వార్డులు యూనిట్‌గా మూడు దశల్లో ఎన్నికలు



నల్లగొండ: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. 2024 ఫిబ్రవరి 1తో గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం పూర్తి కానుంది. పదవీ కాలం ముగిసే మూడు మాసాల ముందుగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలని సూచించింది. డిసెంబరు 30లోగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది నియామకంతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, నివేదికలు పంపించాలని కలెక్టర్లను ఆదేశించింది. దీంతో జిల్లాలో కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులు దీనికి సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు.

మూడు నెలల ముందుగానే నిర్వహించాలి..

జిల్లాలో గతంలో 844 గ్రామ పంచాయతీలుండగా, వాటి పరిధిలో మొత్తం 7,440 వార్డులు ఉన్నాయి. అయితే ఈ పాలకవర్గాల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1తో ముగియనుంది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీ కాలం ముగిసే మూడు మాసాల ముందుగానే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ఎన్నికల సంఘం బుధవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పూనుకుంది. అందుకు సంబంధించి డిసెంబర్ 30లోగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. అయితే జిల్లాలోని నకిరేకల్ మండలంలోని 7 గ్రామ పంచాయతీలు మొదట మున్సిపాలిటీలో చేరాయి. తర్వాత కోర్టు ఆదేశాలతో తిరిగి గ్రామ పంచాయతీలుగా మారాయి. అప్పట్లో వాటి పదవీ కాలం పూర్తయిన తర్వాత తిరిగి ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం ఆ గ్రామ పంచాయతీలు కలుపుకుని మొత్తం 844 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

పంచాయతీ ఎన్నికలకు క్లస్టర్ల ఏర్పాటు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొన్ని గ్రామాలను కలుపుకుని క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలో స్టేజీ1, స్టేజీ2 అధికారులను నియమించనున్నారు. స్టేజీ 1 పరిధిలో అధికారులంతా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుండగా స్టేజీ 2 పరిధిలోని అధికారులు ఎన్నికల నిర్వహణను పూర్తి చేయనున్నారు.

ప్రతి వార్డు ఒక నియోజకవర్గం

గ్రామ పంచాయతీల్లోని ప్రతి వార్డును ఒక నియోజక వర్గంగా ఏర్పాటు చేయనున్నారు. ఆయా వార్డుల్లో ఓటర్లను బట్టి పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. 650 మంది ఓటర్లుంటే రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్

200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. అందుకు పోలింగ్ నిర్వహణకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారిని నియమించాలి. అలాగే 201 నుంచి 400 ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాల్సి ఉంటుంది. వీరందరికి ఎన్నికలకు సంబంధించిన శిక్షణను కూడా ఇవ్వాలి. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది అధికారులు, సిబ్బంది అవసరమో, దానిపై 20 శాతం సిబ్బందిని అదనంగా తీసుకుని రిజర్వులో ఉంచేలా అధికారులు, సిబ్బందిని ఎంపిక చేయాలని సూచించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు సంబంధించి జాబితా తీసుకుని అందులో అవసరమైన వారిని గుర్తించాలని సూచించింది. డిసెంబరు 30వ తేదీలోగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది అందరిని గుర్తించి ఆ డేటాను టీపోల్ అప్లికేషన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించింది.

మూడు దశల్లో ఎన్నికలు

జిల్లాలో ఉన్న 844 గ్రామ పంచాయతీలకు సంబంధించి మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల్లో మొదటి విడత కొన్ని గ్రామ పంచాయతీలకు, రెండో విడత మరికొన్ని, మూడో విడత మిగిలిన గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే విధంగా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. అయితే ఎన్నికల ముసాయిదా జాబితాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారుల నియామకం విషయంలో వారి స్థాయిని బట్టి చూసుకోవాలని ఆదేశించింది. అయితే ఎన్నికలు మూడు దశల్లో జరుగుతున్నందున మొదటి గ్రామ పంచాయతీ స్టేజీ 1 రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు మూడు దశల్లో ఎన్నికలకు ముసాయిదాలు సిద్ధం చేయాల్సి ఉంది. ఈ మూడు దశలకు సంబంధించి ర్యాండమైజేషన్ పద్ధతిలో పోలింగ్ సిబ్బందిని గుర్తించాలని ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం అందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించింది.

క్లుప్తంగా

అదుపుతప్పి దుకాణాలపైకి దూసుకెళ్లిన కారు

- జనసంచారం లేకపోవడంతో తప్పిన ముప్పు

కోదాడరూరల్ : కోదాడలో బుధవారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోదాడ పట్టణంలోని మాతానగర్‌కు చెందిన ఆసీఫ్ తెల్లవారుజామున అతివేగంగా కారును డ్రైవింగ్ చేస్తూ నిద్ర మత్తులో మున్సిపాలిటీ పక్కన ఉన్న తోపుడు బండ్లను, ఓ పార్టీ దిమ్మె, టీస్టాల్‌ను ఢీకొట్టడంతో షాపులన్నీ ధ్వంసమయ్యాయి. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీకి గాయాలు

నల్లగొండ క్రైం : విద్యుదాఘాతంతో ఓ దినసరి కూలీగా గాయాలయ్యాయి. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన కానుగుల సైదులు ఓ లైన్‌మన్ కింద దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. మునుగోడు మండలం కల్వలపల్లి శివారులో ఓ రైతుకు చెందిన సర్వీస్ వైర్‌ను స్తంభంపై తీగలకు కలిపేందుకు వెళ్లాలని లైన్‌మన్ కోరడంతో మంగళవారం సైదులు అక్కడికి వెళ్లాడు. ఎల్‌సీ తీసుకున్నామని చెప్పడంతో సైదులు విద్యుత్ పోల్ ఎక్కి సర్వీస్ వైరు కలుపుతుండగా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. లైన్‌మన్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, అతడిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సైదులు కుటుంబ సభ్యులు బుధవారం నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకుని బలవన్మరణం

ఆలేరురూరల్ : ఆలేరు శివారులో బుధవారం ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(40) కుటుంబం కొంత కాలంగా హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసం ఉంటోంది. గత నవంబర్ 27న శ్రీనివాస్ ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శ్రీనివాస్ భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. పది రోజుల తర్వాత శ్రీనివాస్ ఆలేరు శివారులోని ఆర్‌ఆర్‌ఆర్ రెస్టారెంట్ సమీపంలో వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని శ్రీనివాస్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట శ్రీను తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

మోటకొండూర్: యాదాద్రి డీసీపీ రాజేశ్‌చంద్ర బుధవారం మోటకొండూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బందికి ఫీల్డ్‌లో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలతో ఎలా మెలగాలో సూచనలను చేశారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఏసీపీ శివరాంరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

కూడళ్లు.. యమ డేంజర్



నల్లగొండలో పడవ ఆకృతి దిమ్మెపై ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహం



ఎన్జీ కాలేజీ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ఏనుగు తలల విగ్రహాలు

- నీలగిరిలోని ప్రధాన సర్కిళ్లలో నిత్యం ప్రమాదాలు
- రాంగ్‌రూట్ ప్రయాణాలే ప్రధాన కారణం
- ఎన్జీ కాలేజీ, బస్టాండ్ వద్ద వాహనదారులకు అడ్డుగా ఉన్న ఆకర్షణీయ విగ్రహాలు
- యూటర్న్ తీసుకునే క్రమంలో కనిపించని వాహనాలు

నల్లగొండ క్రైం : నీలగిరి పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇందుకు వాహనదారుల మితిమీరిన వేగం, రాంగ్ రూట్ ప్రయాణాలు, స్పీడ్ బ్రేకర్లు, యూటర్న్‌ల వద్ద సూచిక బోర్డులు లేకపోవడమే ప్రధాన కారణాలు. వీటికి తోడు పట్టణంలోని పలు ప్రధాన ప్రైవేట్ పాఠశాలల వద్ద తమ పిల్లలను తీసుకువెళ్లేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఎక్కడెక్కడంటే..

ప్రధానంగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సుభాష్ విగ్రహం సర్కిల్, ఎన్జీ కాలేజీ వద్ద, ప్రసాద్ ఉడిపి హోటల్, ఎల్‌వీ పెట్రోల్ బంక్, వీటీ కాలనీ, దేవరకొండ రోడ్డులో రెండు ప్రధాన ప్రైవేట్ పాఠశాలలు, రాఘవేంద్రకాలనీ సర్కిళ్ల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

రాంగ్‌రూటైనా మాకు రైటేనంటూ..

జిల్లా కేంద్రంలో ముఖ్యంగా వాహనదారులు రాంగ్ రూట్ ప్రయాణాలు సాగిస్తుండడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సమయాన్ని ఆదా చేసుకునేందుకు వారు చేస్తున్న చిన్న చిన్న తప్పిదాలు మరికొందరికి శాపంగా మారుతున్నాయి. అభివృద్ధి భాగంగా జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రధాన రోడ్డును విస్తరించారు. రోడ్డు సాఫీగా ఉండడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. మధ్య, మధ్యలో స్టాపర్లు ఉన్నా వేగంలో తగ్గేదేలే అంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్టాండ్ సమీపంలోని సుభాష్ విగ్రహం వద్ద వాహనదారులు రాంగ్‌రూట్‌లోనే వెళ్తున్నారు. బస్టాండ్‌లో నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు సైతం సుభాష్ విగ్రహం నుంచి టర్న్ తీసుకోవాల్సి ఉన్నా విద్యుత్ కార్యాలయం ప్రహరీ వెంట నేరుగా సీపీఎం కార్యాలయం వద్ద హైదరాబాద్ రోడ్డుపై నుంచి క్లాక్‌టవర్ వైపు వస్తున్నారు. ఇక్కడ వేగనియంత్రణ కాక ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనాలు కనిపించక..

ఎన్జీ కాలేజీ సర్కిల్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన ఏనుగుల విగ్రహాలు అడ్డుగా ఉండడంతో పాటు దిమ్మె కూడా ఎత్తుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎల్‌పీటీ మార్కెట్‌లోకి వెళ్లే వాహనదారులు ఎస్పీ కార్యాలయం వద్ద ఒక్కసారిగా యూటర్న్ తీసుకుంటున్నారు. ఇక్కడ రోడ్డు మధ్యలో దిమ్మెలు ఎత్తుగా ఉండడంతో వాహనాలు కనిపించడం లేదు. వీటీ కాలనీ వద్ద ఏర్పాటు ఆకర్షణకు ఏర్పాటు చేసిన పడవ కూడా ఇబ్బందిగా మారిందని వాహనదారులు పేర్కొంటున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



పట్టణంలోని పలు ప్రధాన సర్కిళ్ల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు తరచూ జరిగే చోట బారీకేడ్స్, వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయించాం. ప్రధాన రహదారి నుంచి సైడ్ రోడ్లు దిగువకు ఉండటం వల్ల వాహనదారులు గమనించకుండా అకస్మాత్తుగా వస్తుండడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్‌జీ కాలేజీ వద్ద ఉన్న విగ్రహాలతో ఎదురుగా వచ్చే కనిపించడం లేదని ఎక్కువ మంది వాహనదారులు చెబుతున్నారు.

– డేనియల్, ట్రాఫిక్ సీఐ,నల్లగొండ

ఇటీవల కొన్ని ప్రమాదాలు

- రెండు నెలల క్రితం హైదరాబాద్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న యువకుడు ఉడిపి హోటల్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో పట్టణంలోకి వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు.
- పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ తహసీల్దార్ సుమారు 40 రోజుల క్రితం ఎన్జీ కాలేజీ మైదానంలో వాకింగ్ పూర్తి చేసుకుని హైదరాబాద్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో క్లాక్‌టవర్ వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టడంతో రిటైర్డ్ తహసీల్దార్ తీవ్రంగా గాయపడి ప్రాణాలు విడిచాడు.
- పట్టణంలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వైపు నుంచి ఎల్‌వీ పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాద్ రోడ్డుకు వచ్చే వాహనదారులు ఒక్కసారిగా వస్తున్నారు. దీంతో ఇరువైపుల నుంచి వచ్చే వాహనాలకు వేగనియంత్రణ కాక ప్రమాదాలు జరుగుతున్నాయి.
- తాజాగా మంగళవారం అర్ధరాత్రి ఎన్జీ కాలేజీ వైపు నుంచి వచ్చే ఓ కారు యూటర్న్ తీసుకోకుండా డీఎస్పీ కార్యాలయం వెళ్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ రోడ్డు నుంచి క్లాక్‌టవర్ వైపు వెళ్తున్న ఫార్చునర్ కారు డీఎస్పీ కార్యాలయం వైపు వెళ్లే కారును తప్పించబోయి అదుపుతప్పి ఐడియా షోరూం వద్ద డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. కారు డ్రైవర్ ప్రాణాపాయాన్ని తప్పించుకుని స్వల్పగాయాలతో బయటపడ్డాడు.





ఎన్‌జీ కాలేజీ వద్ద మంగళవారం అర్ధరాత్రి బోల్తాపడిన ఫార్చునర్ కారు, ధ్వంసమైన ఫుట్‌పాత్

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు

- నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



గాజులమల్కాపురంలో సాగవుతున్న వేరుశనగ పంట

పెన్‌పహాడ్: యాసంగిలో ఆరుతడి పంటలైన శనగ, మొక్కజొన్న, జొన్న పంటలతగో పాటు వివిధ రకాల కూరగాయాలు సాగు ఎంతో మేలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. యాసంగిలో ఆరుతడి పంటలపై నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సూచిస్తున్నారు. రైతులు పొలాల వద్ద ఇంకుడుగుంత నిర్మించుకుంటే అందులో వర్షపు నీరు చేరి నిల్వ ఉంటుందని చెబుతున్నారు.

నీటి తడులు అందించాలి

పంటలకు కీలకమైన పూతదశలో పంట నీటిఎద్దడికి గురైతే 50శాతం కన్నా తక్కువ దిగుబడి వస్తుంది. నీటితడులు లేక దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. పంటలకు గింజకాయ కట్టే దశలో నీటిని అందించాలి. జొన్న పంటలకు సాధారణంగా 400–660మి.మీ అవసరం ఉంటుంది. మొక్కజొన్నకు 400–550 మి.మీ నీరు వేరుశనగతో పాటు ఇతర పంటలకు 300–400 మి. మీ నీరు అవసరం. ఇందులో మొక్కలు నాటిన 15–18రోజుల్లో నీటి తడులు అందించాలి. పంట తీసే సమయంలో కంటే 15 నుంచి 28 రోజుల్లోపు చివరి తడి అందించాలి. నీటి పారకంలో ద్వారా కాకుండా మొక్కల మొదట్లో నీరందిస్తే వేర్లకు త్వరగా చేరుతుంది. యాసంగిలో సాగుచేసే వరి పంటకు నాటు వేసినప్పుడు నుంచి పొట్టదశకు చేరే వరకు నీరు అవసరం ఉంటుంది. రైతులు మూస ధోరణి కాకుండా ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేయాలి. దీంతో అధిక దిగుబడులు పొందుతారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. నీటి వినియోగాన్ని బట్టి పొదుపుగా వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని వారికి వివరిస్తున్నారు.

వేరుశనగ పంటతో లాభాలు



ప్రతి యాసంగి పంటలో 2.30ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తా. వేరుశనగ పంటతో అధిక లాభాలు సాధించవచ్చు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు అందిస్తారు.

– నలబోలు వెంకట్‌రెడ్డి, రైతు, గాజులమల్కాపురం

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు పండిస్తే రైతుల కు మంచి లాభం చేకూరుతుంది. ఆరుతడి పంటలతో పాటు కూరగాయాల సాగు ద్వారా అధిక దిగుబడి సాధించాలి.

– కృష్ణసందీప్, ఏఓ, పెన్‌పహాడ్

రెండు బైక్‌లు ఢీ.. విద్యార్థి దుర్మరణం

మోత్కూరు : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన చల్లా రమేష్, బుచ్చమ్మ దంపతుల కుమారుడు చల్లా ప్రవీణ్ (16) బుధవారం బైక్‌పై మోత్కూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైక్ రైస్ మిల్లు సమీపంలో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడని 108 పైలట్ సోమేష్, ఈఎంటీ భాస్కర్ తెలిపారు. రమేష్, బుచ్చమ్మలకు ప్రవీణ్‌తో పాటు కుమార్తె భూమిక ఉన్నారు. ప్రవీణ్ హైదరాబాద్‌లోని బోడుప్పల్ ఎస్‌ఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఎదిగిన కుమారుడు ఇక లేడనే చేదు నిజాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక గుండెలవిసేలా రోదిస్తున్నారు. ప్రవీణ్ మృతితో రాజన్నగూడెంలో విషాదం అలుముకుంది. మరో బైక్‌పై వస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదంలో దెబ్బతిన్న రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవరకొండలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. సుమారు 50ఏళ్ల గల మతిస్థిమితం లేని వ్యక్తి కొన్ని రోజులుగా పట్టణంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ముందు గల ప్రహరీ వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న వారికి విగతజీవుడిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు యాచకుడని, మారిన వాతావరణ పరిస్థితులకు తోడు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నియంతపాలన నుంచి ప్రజలకు విముక్తి

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

భూదాన్‌పోచంపల్లి : నియంత పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిందని మాజీ ఎంపీ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయిలో ఉన్న పట్టుతో అసెంబ్లీ ఎన్నికలలో గెలిచిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపే ఉంటారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2014 నుంచి జరిగిన అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఎంతో ఉందన్నారు. ఉచిత కరెంట్, ఎరువులు, ఉచిత రేషన్ బియ్యం, వైద్యం కోసం లక్షల కోట్లు నిధులు మంజూరీ చేసిందన్నారు. అయితే కేసీఆర్ మోదీ ఫోటో కన్పించకుండా అన్ని తన పథకాలుగా తప్పుడు ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలో రూ.9వేల కోట్ల నిధులు తీసుకొచ్చానని తెలిపారు. ప్రస్తుత ఎంపీ ఒక్కనాడు పార్లమెంట్‌లో మాట్లాడలేదని విమర్శించారు. సమావేశంలో నాయకులు చిక్క కృష్ణ, నవీన్‌గౌడ్, దోర్నాల సత్యం, గంజి బస్వలింగం, డబ్బీకార్ సాహేశ్, ఏలే శ్రీనివాస్, రచ్చ సత్యనారాయణ, చెరుకు వెంకటేశం పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

వలిగొండ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వలిగొండ మండల కేంద్రంలోని రేగులకుంటకు చెందిన గొలుసుల భాస్కర్ (26) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భాస్కర్ మద్యానికి బానిస కావడంతో పాటు కూలి పనులు కూడా చేయడం లేదు. ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు నచ్చచెప్పినా భాస్కర్ తీరు మారకపోవడంతో ఆరు మాసాల క్రితం ఇతడి భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరి తనానికి తోడు ఆలనాపాలనా చూసే వారు లేక జీవితంపై విరక్తి చెందిన భాస్కర్ బుధవారం ఇంట్లోనే ఇనుప పైపునకు తాడుతో ఉరేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించేలోపే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

చురుగ్గా మోడ్రన్ ధోబీఘాట్ పనులు

- రూ.2 కోట్లతో నిర్మాణం
- అధునాతన యంత్రాలతో ఏర్పాటు



నిర్మాణంలో ఉన్న మోడ్రన్ ధోబీఘాట్

మోత్కూరు : పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో బిక్కేరు చెంతన రూ.2 కోట్లతో నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీఘాట్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రెండు నెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నిధులు మంజూరు చేయించి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో ధోబీఘాట్ నిర్మాణం చేపట్టారు. స్లాబ్ దశలో పనులు ఉన్నాయి. వీటిలో రూ.45 లక్షలు యంత్రాలకు వినియోగించనున్నారు. మరో 3 నెలల్లో ధోబీ ఘాట్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 100 రజక కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రధాన రోడ్డు వెంట ల్యాండ్రీ దుకాణాలు నిర్వహిస్తుండటంతో పాటు తమ స్వంత నివాస గృహాల్లో కూడా షాపులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అప్పటి ప్రభుత్వం ల్యాండ్రీ దుకాణం వారికి 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందిస్తుంది. మోడ్రన్ దోబీ ఘాట్ నిర్మాణం పూర్తి కాగానే పెద్ద షెడ్డు నిర్మిస్తారు. అనంతరం యంత్రాలను అమరుస్తారు. ఆధునాతన విధానంలో బట్టలు ఉతికే యంత్రాలు, ఉతికిన వాటిని ఆరబెట్టే యంత్రాలు తరువాత ఇస్త్రీ చేసి పెట్టే యంత్రాలను ప్రభుత్వమే సమకూర్చనున్నది. గంటకు 200 దుస్తులు ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను రూపొందించారు.

మూడు నెలల్లో పూర్తి



మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో మోడ్రన్ ధోబీ ఘాట్‌ను రూ.2 కోట్లతో నిర్మిస్తున్నాం. ఇప్పటికీ 75 శాతం పనులు పూర్తయ్యాయి. మరో మూడు నెలల్లో ధోబీఘాట్ అందుబాటులోకి రానుంది. పూర్తిస్థాయి మిషనరీ వస్తుంది. రజకులకు ధోబీఘాట్ ఎంతో ఉపయోగ పడుతుంది.

– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

సంతోషంగా ఉంది



ప్రభుత్వం ఆధునిక ధోబీఘాట్ నిర్మిస్తున్నది. మా రజక వృత్తిదారులకు చాలా సంతోషంగా ఉంది. మోడరన్ ధోబీ ఘాట్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు కృతజ్ఞతలు. మా వృత్తిలో కూడ ఇబ్బందులు తప్పనున్నాయి.

– కూసంపల్లి సోమనర్సయ్య, మోత్కూరు

వరిలో దమ్ము ప్రక్రియ, సస్యరక్షణ చర్యలు ఇలా..

- పెద్దవూర ఏఓ సందీప్‌కుమార్ సూచనలు



సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

పెద్దవూర: వరిసాగులో భూమిని దమ్ము చేసే ప్రక్రియ నుంచి పంట చేతికి వచ్చేవరకు రైతులు శాస్త్రీయ మెళకువలు పాటిస్తే పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంటుందని పెద్దవూర వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. వరిసాగులో చిన్నచిన్న మెళకువలను పాటించకపోవడం వలన రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.



వరి పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

పాడి పంట

దమ్ము చేసేటప్పుడు..

వరికోతల తరువాత చేలల్లో మిగిలిన గడ్డిని చాలామంది రైతులు పొలంలోనే కాల్చివేస్తున్నారు. వరిగడ్డిని తగులబెట్టడం వలన భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది. భూమి పొరల్లో ఉండే పోషకాల లభ్యత తగ్గుతుంది. భూమి పైపొరల్లో ఉండే మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులకు నష్టం కలుగుతుంది. గడ్డిని తగులబెట్టడం వల్ల కార్బన్‌డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, కర్బన పదార్థాలు అధికంగా విడుదల అవుతాయి. పొలంలో మిగిలిన గడ్డిని కాల్చకుండా పలుచగా చేసి ఎకరానికి 4బస్తాల సూపర్ పాస్పేట్, అరబస్తా యూరియా కలిపి చల్లాలి. ఆ తరువాత దమ్ము చేస్తే గడ్డి త్వరగా భూమిలో కుళ్లిపోతుంది. అలాగే గడ్డిని పలుచగా చల్లక రోటావేటర్లతో దమ్ము చేస్తే గడ్డి త్వరగా భూమిలో కలిసిపోతుంది. పంట దమ్ముకీ, మురగదమ్ముకీ మధ్య వ్యత్యాసం 10–15 రోజుల మధ్యఉండేలా చూసుకోవాలి. క్రిషిట్రాక్టర్ లేదా రోటావేటర్స్ ఉన్న ట్రాక్టర్లతో పొలంలో దమ్ము చేయాలి. దీనివల్ల దమ్ము 6 అంగుళాల లోతులో ఏర్పడుతుంది. దీంతో మూస త్వరగా తిరిగే అవకాశం ఉంటుంది. అలాగే భూమి పైపొరల్లో ఉండే పోషకాలు మొక్కకు సక్రమంగా అందుతాయి.

నారుమడిలో..

చలి అధికంగా ఉన్నప్పుడు నారుమడికి పాతనీరు తీసి కొత్త నీరు పెడుతూ ఉండాలి. 2 గుంటల నారుమడికి 2.2 కిలోల యూరియా రెండు దఫాలుగా, 6.5 కిలోల సూపర్‌పాస్పేట్‌ను ఒక దఫాగా, 1.2 కిలోల పొటాష్‌ను ఎరువుగా ఒక దఫాలో వేయాలి. నారుమడిలో జింక్ లోపం లక్షణాలు కనబడితే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణం పిచికారీ చేయాలి. ప్రస్తుతం నారుమడుల్లో కాండం తొలుచు పురుగు, రెక్కలతొలుచు పురుగు, ఆకు అడుగున గుడ్లు అధికంగా కనిపిస్తాయి. దీని నివారణకు లీటర్ నీటిలో 1500 పీపీఎం వేపనూనెను 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఒక గుంట నారుమడికి 400 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను నారుమడి వేసిన 10–15 రోజుల్లో చల్లాలి. రెక్కలపురుగు నివారణకు నారుమడికి దూరంగా నాలుగు వైపులా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం, క్లోరోపైరిఫాస్ కలిపిన నీటిని పళ్లెంలో ఉంచడం, సాయంత్రం వేళల్లో అక్కడక్కడా మంటలు వేయడం ద్వారా అరికట్టవచ్చు. వరినాట్లు వేసేటప్పుడు ఆకు చివర్లను తుంచివేయడం ద్వారా తాటాకు తెగులును అరికట్టవచ్చు.

విత్తనశుద్ధి తప్పనిసరి

నారుమడి వేసే ముందు రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. ఒక కిలో విత్తనాలకు 3 గ్రాముల చొప్పున కార్బండిజమ్ పౌడర్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. విత్తనశుద్ధి చేయడం వలన ఆరోగ్యవంతమైన నారు పెరుగుతుంది. మాగుడు తెగులు, అగ్గితెగులు, మానిపండు తెగులు అదుపులో ఉంటాయి. వెదజల్లు పద్ధతిలో నారుమడులు వేయడానికి ఎకరానికి 10–12 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఈ పద్ధతికి పొలాన్ని తప్పనిసరిగా చదును చేయాలి.